క్లుప్తంగా

27న పొన్నూరుకు సీఎం వైఎస్ జగన్


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

పొన్నూరు(చేబ్రోలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27వ తేదీన పొన్నూరు రానున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను మంగళవారం జిల్లా అధికారులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, తెనాలి డీఎస్పీ స్రవంతిరాయ్‌లు ఏర్పాట్లు పరిశీలించినవారిలో ఉన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నెహ్రూనగర్: వేసవిలో గుంటూరు నగరంలో తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం గుంటూరు నగరంలోని ఎల్ఎల్ఆర్ రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేసే సంగం జాగర్లమూడి వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. పర్యటనలో తొలుత జాగర్లమూడి ప్లాంట్ నుంచి ఎంత వాటర్ ఎల్ఎల్ఆర్ రిజర్వాయర్‌కు సరఫరా అగుతుంది? తాగునీటి సరఫరా సమయాలు, క్లోరినేషన్ వంటి వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగం జాగర్లమూడిలోని రిజర్వాయర్‌ను 1948లో నిర్మాణం ప్రారంభించి 1956లో వినియోగంలోకి తెచ్చారన్నారు. ఇంజినీరింగ్ అధికారులు తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. లీకేజీలు ఏమైనా ఏర్పడి ఉంటే వెంటనే మరమ్మతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నూతన ప్లాంట్ ద్వారా 25 మిలియన్ లీటర్లు పర్ డే (ఎంఎల్‌డీ) తాగునీరు సరఫరా అవుతోందని తెలిపారు. పాతప్లాంట్‌ను కూడా వినియోగంలోకి తెస్తే మరో 25 ఎంఎల్‌డీ తాగునీరు అందుబాటులోకి వస్తాయన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను మంగళవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య ఆర్.శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఇండియన్ కాపిటల్ మార్కెట్' అనే అంశంపై ఫిబ్రవరి 24, 25 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలు, బిజినెస్ రంగ సంస్థలకు చెందిన నిపుణులు హాజరుకానున్నారని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, అధ్యాపకులు డాక్టర్ రతనకిషోర్, డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ విష్ణు, డాక్టర్ సుధీర్, డాక్టర్ భాను చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎకనామిక్స్ విభాగంలో..

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను మంగళవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య కె.మధుబాబు మాట్లాడుతూ '75 ఏళ్ల భారత ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక అభివృద్ధి, సమన్యాయం' అనే అంశంపై మార్చి 9, 10 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ సదస్సుకు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను మార్చి 5వ తేదీలోగా అందజేయాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వర్సిటీ పాలకమండలి సభ్యులు, సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య సరస్వతిరాజ్ అయ్యర్, ఎకనామిక్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఆషా సజని

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కె.ఆషాసజనిని నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కె.వెంకటతులశమ్మను కర్నూలు జీజీహెచ్‌కు, కర్నూలులో పనిచేస్తున్న ఆషాసజనిని గుంటూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళతో అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

పట్నంబజారు: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీజీహెచ్‌లో షేక్ మున్ని అనే మహిళ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో మంగళవారం జీజీహెచ్‌కు వచ్చిన దేవరపల్లి మార్తయ్య షేక్ మున్నితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న వల్లే సామాజిక న్యాయం


పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

- ప్రతి కులానికీ రాజ్యాధికారం ఘనత ఆయనదే
- రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

తాడికొండ: సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతోందని, ప్రతి కులానికీ రాజ్యాధికారం అందించిన ఘనత ఆయనదేనని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్లు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి మర్రి రాజశేఖర్ చెప్పారు. మంగళవారం తాడికొండ అడ్డరోడ్డులోని జీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన పార్టీ తాడికొండ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి వీరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్య, వైద్య రంగాలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. బలహీన వర్గాలకు ప్రాధాన్యమిస్తూ దేశానికే ఆదర్శంగా అందిస్తున్నారని కొనియాడారు. పార్టీ పటిష్టతకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. జన సంక్షేమంలో దేశంలోనే ఏపీ ముందుందని, పిల్లల చదువు కోసం, జన ఆరోగ్యం కోసం పెట్టే ఖర్చు వృథా కాదని, వారి భవిష్యత్తుకు పెట్టుబడి అవుతుందని నమ్మిన జగనన్న విద్యా, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చారని గుర్తు చేశారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలన్నారు. కరోనా వైరస్ మహమ్మారి వల్ల వచ్చిన సంక్షోభంలోనూ గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటికే పాలన తీసుకొచ్చి అండగా నిలిచిన జగనన్నకు ప్రజలు అంతే అండగా నిలుస్తారనడంలో సందేహం లేదన్నారు. 2024 ఎన్నికల్లో 175కి 175 సీట్లు సాధించే లక్ష్యంతో కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై, వైఎస్సార్ సీపీపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేసే ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో తాడికొండ నియోజకవర్గం నుంచే మొదటి విజయం ప్రారంభం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్ని గ్రామాల కార్యకర్తలు నాయకులతో ఓపికగా మాట్లాడిన రీజినల్ కో-ఆర్డినేటర్‌లు తమ దృష్టికి వారు తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- 11వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం


వృద్ధులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు(చేబ్రోలు): పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణ పరిధిలో నాగుల చెరువు సచివాలయ పరిధిలో రెండో రోజు 11వ వార్డులో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా పేదలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో అభివృద్ధి సాధించేందుకు ముఖ్యమంత్రి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. మహిళలు, ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పలు పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో 50శాతం మహిళలకే కేటాయించి మహిళా పక్షపాతిగా పేరు పొందారన్నారు. రైతు భరోసా, ఉచిత పంటల బీమా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పథకాలు దీర్ఘకాలం సాగేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని అనేక హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందటానికి ప్రతిపక్షాలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. పరిపాలన వ్యవస్థలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పెనుమార్పులు తీసుకువచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే పాలన అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో అమలు జరుగుతున్నాయన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యలకు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అక్కడక్కడే పరిష్కారం చూపారు. వార్డులో మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ చిట్టినేని వెంకట్రావు ఇంటి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కమిషనర్ రాధారెడ్డి, చిట్టినేని సతీష్, పలగాని రమేష్, నన్నపనేని పెద్ది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

బాలికలు ఉన్నతశిఖరాలు అధిరోహించాలి


పెదకాకాని జడ్పీస్కూల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


జాతీయ బాలికా దినోత్సవం వాల్‌పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న సీఐ, సిబ్బంది


మాట్లాడుతున్న లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ దీప

చేబ్రోలు: బాలికలు అన్నిరంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు, వడ్లమూడి, శేకూరు గ్రామాల్లో మంగళవారం జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.అలివేలు మంగ, నాగమణిలు మాట్లాడుతూ బాలికల రక్షణ కోసం ప్రభుత్వం దిశ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఆపదలో ఉన్నప్పుడు దిశ యాప్ పోలీసులకు సమాచారం అందించటంలో తోడ్పాటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకుమానులో...

కాకుమాను: ఆడపిల్లల విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని తల్లిదండ్రులు తమ చిన్నారులను తప్పనిసరిగా ఉన్నత చదువులు చదివించాలని ఐసీడీఎస్ పాండ్రపాడు సెక్టార్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని బీకేపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఆడపిల్లలను కాపాడుదాం, ఆడపిల్లలను చదివిద్దాం అనే అంశంపై చిన్నారుల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం గేరా మోహనరావు, ఉపాధ్యాయిని మహ్మద్ షహనాజ్‌బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదకాకానిలో..

పెదకాకాని: బాలికలు అన్ని రంగాల్లో రాణించి సమాజంలో గౌరవ ప్రదమైన గుర్తింపు తెచ్చుకోవాలని ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు అన్నారు. పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి బాలిక చదువుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వ వారి విద్యాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులచే ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం పుట్టా దుర్గ, ఈఓపీఆర్డీ రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలానే చైల్డ్ రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం పోస్టర్లు ఆవిష్కరించారు. మండలంలోని అనుమర్లపూడి, తంగెళ్ళమూడి, ఉప్పలపాడు, కొప్పురావూరు గ్రామాల్లో బాలికా దినోత్సవం నిర్వహించారు. క్రాప్ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకయ్య ఆధ్వర్యంలో బాలికల విద్య, ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మంగళగిరి గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ ఆధ్వర్యంలో పెదకాకాని పోలీసుస్టేషన్‌లో సీఐ బండారు సురేష్‌బాబు చేతుల మీదుగా జాతీయ బాలికా దినోత్సవం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంస్థ మండల కో-ఆర్డినేటర్ బి.విజయలక్ష్మి అధ్యక్షతన పెదకాకాని సచివాలయం 4, లూథర్‌గిరి ప్రాథమిక పాఠశాల, నంబూరు బాలికల జిల్లా పరిషత్ పాఠశాలల్లో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికల సంరక్షణ హక్కు, విద్య, గౌరవం, ఆరోగ్యం, సామాజిక ఎదుగుదల వంటి అంశాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పాదర్తి కోటేశ్వరరావు, గీతాంజలి, హ్యూమన్ రైట్స్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కె.అనూషా పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ పరిధిలో..

గుంటూరు రూరల్: ఆడపిల్లలను చదివించి వారి హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని 41వ డివిజన్ కార్పొరేటర్ బి.స్మితపద్మజ తెలిపారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా డివిజన్ పరిధిలోని స్వర్ణభారతినగర్‌లో ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దామంటూ ప్రధాన వీధుల్లో ర్యాలీని నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ టి.శ్రీదేవి, సూపర్‌వైజర్ బి.శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులున్నారు. అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మిల్లెట్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ దీప ముఖ్య అతిథిగా హాజరై మిల్లెట్స్‌తో వంటలు, చిరుతిండ్లు తదితరాలను తయారు చేసుకునే విధానాలు తెలిపారు. నల్లపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ మెహరున్నీసా, హెచ్ఎం మణికుమార్ తదితరులు పాల్గొన్నారు. వెంగళాయపాలెం మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం, బాలికా రక్షణ చట్టాలు, ఆరోగ్యం పట్ల అవగాహన సదస్సును నిర్వహించారు. వెల్ఫేర్ సెక్రటరీ మల్లు, మహిళా పోలీస్ వి నిర్మలబాయి తదితరులున్నారు.జొన్నలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు రక్షణ చట్టాలు, విద్య, ఆరోగ్యం, సంరక్షణ తదితర విషయాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యవాణి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ సౌమ్య, కార్యకర్తలు శ్రీదేవి, కృపావతి తదితరులున్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో కాసరనేని సదాశివరావు జయంతి


డాక్టర్ సదాశివరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్య వైద్య రంగంలో డాక్టర్ కాసరనేని సదాశివరావు సేవలు చిరస్మరణీయమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన డాక్టర్ కాసరనేని సదాశివరావు శతజయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సదాశివరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ భారతదేశంలోనే గొప్ప శస్త్రచికిత్స నిపుణుడుగా కీర్తి ప్రతిష్టలను పొందిన వైద్యుడు డాక్టర్ సదాశివరావు అని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ వైద్య రంగంలో డాక్టర్ సదాశివరావు సేవలు అమోఘమన్నారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు, పేదవారికి వైద్య సేవలు అందించి తన సేవా నిరతిని చాటుకున్న గొప్ప మహోన్నతుడు ఆయనని కొనియాడారు. పీవీ శంకరరావు, పాతూరి కోటేశ్వరరావులు మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా తమవద్దకు వచ్చే రోగులకు నిస్వార్థ సేవలు అందించటం తమ గురువుకు ఇచ్చే గురుదక్షిణ అని తన శిష్యులకు ఆయన తెలిపేవారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ జగదీష్, పాలకమండలి సభ్యులు చుక్కపల్లి రమేష్, డాక్టర్ పి.గోపిచంద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కృష్ణవర్ధన్ పాల్గొన్నారు.

పండుగ మహోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: యేసు పవిత్ర హృదయ పుణ్యక్షేత్రం మూడు రోజుల పండుగ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పెదకాకాని మండలం నంబూరు విజయభాస్కర్‌నగర్‌లో ప్రతి ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పండుగ మహోత్సవాన్ని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ సాంప్రదాయ బద్ధంగా మరియ తల్లికి కొబ్బరికాయ కొట్టి, పతాకావిష్కరణ గావించి ప్రారంభించారు. పండుగ మహోత్సవాన్ని పురస్కరించుకుని మరియతల్లి దీవెనలు, చర్చిలో ఫాదర్ నవీన్ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ నవీన్, కన్వీనర్ కూచిపూడి మోహన్ రావు, తెలుగు బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ రాజు, చర్చి పెద్దలు ఆర్‌సీఎం యూత్ చిన్నారులు, పెద్దలు కోడూరు కనకరాజు, సెయింట్ జోసెఫ్ సిస్టర్స్ ఫాదర్ కిరణ్ రమేష్, కల్చరల్ కన్వీనర్ పాలపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైన్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

నెహ్రూనగర్: రోడ్ల విస్తరణ పూర్తయిన ప్రాంతాల్లో డ్రైన్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని, అందుకు తగిన విధంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, సీపీడీసీఎల్ అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో ఇంజినీరింగ్ అధికారులు, సీపీడీసీఎల్, ఆర్అండ్‌బీ అధికారులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇతర శాఖలతో సమన్వయంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పెద్దపలకలూరురోడ్డు, కుగ్లర్ హాస్పిటల్ రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయని, డ్రైన్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డ్రైన్ల నిర్మాణం పూర్తయిన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సీపీడీసీఎల్ అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ రిజర్వాయర్లకు ప్రత్యేకంగా విద్యుత్ లైన్ ఏర్పాటుకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా నగరంలోని పబ్లిక్ టాయిలెట్లకు వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని, టెండర్ పొంది వర్క్ అగ్రిమెంట్ అయిన పనులు వేగంగా జరిగేలా చూడాలని ఏఈలను ఆదేశించారు. పూర్తి చేసిన పనులకు బిల్లుల చెల్లింపునకు ప్రాసెస్ చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈ భాస్కర్, ఈఈలు సుందరరామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, సీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసబాబు, నగరపాలక సంస్థ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు

పెదకాకాని: కమ్యూనిటీ హాలు భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేయడం జరిగిందని మండల అభివృద్ధి అధికారి బీవీ మల్లేశ్వరరావు తెలిపారు. పెదకాకాని మండలం తంగెళ్లమూడి గ్రామంలో రోడ్లు, మరుగుకాలువల నిర్మాణానికి గతంలో రూ.20 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. సర్పంచి జిల్లెళ్ల కిషోర్ ఆధ్వర్యంలో ఆ నిధులను సద్వినియోగం చేసుకోవడంలో గ్రామ ప్రజలు సఫలీకృతమయ్యారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకము(పీఎంఏజీవై) నిధులు 70 శాతం సద్వినియోగం చేసుకోవడంతో నిధులు ఉపయోగించుకోవడంలో ఆసక్తి కనపరచి గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నందుకు గాను కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆదర్శ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ధామ్ పథకం ద్వారా మరో రూ.25 లక్షలు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ అయినట్లు మంగళవారం ఎంపీడీఓ తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకుని గ్రామ ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉండేలా కమ్యూనిటీ హాలు నిర్మించుకోవాలని సూచించారు.

లాంగ్వేజ్ పండిట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డీఈవో శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల వద్ద ఉన్న సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో మంగళవారం లాంగ్వేజ్ పండిట్ పరీక్షా కేంద్రాన్ని డీఈవో పి.శైలజ సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షలు జరుగుతున్న తీరును ఆమె పరిశీలించారు. ఈ నెల 28 వరకు జరిగే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్, శాఖాధికారికి సూచించారు. బోయపాలెంలోని డైట్ కళాశాలలో జరుగుతున్న డీఎడ్ సెమిస్టర్-1 పరీక్షల తీరును ప్రభుత్వ పరీక్షల విభాగ సహాయ కమిషనర్ కె.వెంకటరెడ్డి పరిశీలించారు. డీఎడ్ పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

పాత గుంటూరు: సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డు 7వ లైనులోని సీతారామస్వామి ఆలయంలో మందిరం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహదాశీర్వచనం, ఆచార్య సంభావనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దిరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, మందిర సొసైటీ అధ్యక్షుడు కె.సాంబశివరావు, కార్యదర్శి కల్లి సుందరరామిరెడ్డి, సభ్యులు కల్లి శ్రీనివాసరెడ్డి, ఎం.నరసింహారావు, లింగంటి జయలక్ష్మి, భావనాకృష్ణ, ఎస్.కోదండరామిరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వృద్ధురాలు మృతి

లక్ష్మీపురం: మంగళగిరి రైల్వే బ్రిడ్జి కింద రైల్వే ట్రాక్ పక్క వృద్ధురాలు మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి రైలు పట్టాల వద్ద సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధురాలిని గుర్తుతెలియని రైలు ఢీకొట్టడంతో మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాస్‌కు సమాచారం అందింది. పరిసర ప్రాంతాల వారిని మృతురాలి వివరాలపై విచారించగా తెలియదని చెప్పడంతో రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. మృతురాలు ఎర్రరంగు చీర, ఆకు పచ్చ రంగు జాకెట్, మెడలో పసుపు తాడుతో ఉన్నట్లు గుర్తించారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27546 నంబర్‌కు సమాచారం అందించాల్సిందిగా సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: సింగిల్ నంబర్ ఆట నిర్వహిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గుజ్జనగుండ్లలో బత్తుల గోపీనాథ్ అనే వ్యక్తి సింగిల్ నంబర్ ఆట నిర్వహిస్తున్నాడన్న సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడి చేశారు. గోపీనాథ్‌ను స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ.4,300 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.